ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



తూర్పుగోదావరి
16+4
శనివారం 29 డిసెంబరు 2018



# విద్యా వ్యవస్థలో మార్పుతోనే నాణ్యమైన విద్య

▸▸ ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్ ▸▸ ఘనంగా జేఎన్టీయూకే దశాబ్ది ఉత్సవాలు ▸▸ ముగిసిన టెక్నోఫెయిర్



వేడుకలను ప్రారంభిస్తున్న ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయభాస్కర్

జేఎన్టీయూకే, డిసెంబరు 28: విద్యావ్యవస్థలో మార్పులు తీసుకురాగలిగితే నాణ్యమైన విద్యను అందించడం సాధ్యమవుతుందని ఏపీపీఎస్సీ చైర్మన్ ప్రొఫెసర్ పి.ఉదయ భాస్కర్ పేర్కొన్నారు. జేఎన్టీయూకే ఆవిర్భవించి పదేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం వర్సిటీలోని అలూమ్ని ఆడిటోరియంలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వేడుకల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఉదయభాస్కర్ పాల్గొనగా వీసీ ప్రొఫెసర్ ఎం.రామలింగరాజు అధ్యక్షత వహించారు. మొదటిగా ఉదయభాస్కర్ జ్యోతి ప్రజ్వలనచేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను చదువుకుని ఉద్యోగం చేసిన విశ్వవిద్యాలయం దశాబ్ది వేడుకలకు ముఖ్యఅతిథిగా రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం మాతృభాషను నిర్లక్ష్యం చేస్తున్నారని అందుకే పోటీపరీక్షలైన గ్రూప్-1లో తెలుగును తప్పనిసరి చేశామన్నారు. ఇంజనీరింగ్‌విద్యలో నాణ్యతను పెంచేందుకు నైపుణ్యాల శిక్షణపై గురుపెట్టాలన్నారు. కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ ఎం.రామలింగరాజు మాట్లాడుతూ ఇదే యూనివర్సిటీలో విద్యార్థిగా, అధ్యాపకుడిగా, డైరెక్టర్‌గా, ఉపకులపతిగా సేవలందించడం తన అదృష్టమన్నారు. అనంతరం రిజిస్ట్రార్ సుబ్బారావు మాట్లాడుతూ వర్సిటీలో ఆర్థిక లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నామని అన్నివిభాగాలలో కాగితరహిత ప్రక్రియను అనుసరిస్తున్నామన్నారు. ఈసందర్భంగా జేఎన్టీయూకే విజయాలతో కూడిన సంచికను సీడీరూపంలో ముఖ్యఅతిథి చేతులమీదుగా విడుదల చేశారు. టెక్నోఫెయిర్‌లో విద్యార్థులు ప్రదర్శించిన పలుప్రాజెక్టులను, ఆడిటోరియం వద్ద ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను సందర్శించారు. అనంతరం జరిగిన ప్లీనరీలో మాజీ ఉపకులపతులు, విద్యావేత్తలు, ఐఐటీ, ఎన్ఐటీ మాజీ ప్రొఫెసర్లు, నిపుణులు పాల్గొని అవుట్ కమ్ బేస్డ్ విద్యా విధి విధానాలపై చర్చించి తమఅభిప్రాయాలు, సలహాలు సూచనలు అందించారు. కార్యక్రమంలో జేఎన్టీయూకే మాజీఉపకులపతులు డాక్టర్ అల్లం అప్పారావు, వీఎస్ఎస్ కుమార్, రెక్టార్ శాంతిప్రభ, ఓఎస్డీ డాక్టర్ రవీంద్రనాథ్, డీఏసీ డైరెక్టర్ డాక్టర్ గోపాలకృష్ణ పలువురు డైరెక్టర్లు, ప్రోగ్రాండైరెక్టర్లు, పూర్వవిద్యార్థులు అనుబంధ కళాశాలల యాజమాన్యాలు, పారిశ్రామిక వేత్తలు, విద్యావేత్తలు, ప్రిన్సిపాల్స్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నిర్వహించిన పలుపోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. సాయంత్రం నిర్వహించిన పలుసాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, సంప్రదాయ వస్త్రధారణలు అందర్నీ ఆకట్టుకున్నాయి.



టెక్నో ఫెయిర్‌లో విద్యార్థుల ప్రాజెక్టులు







ఉత్సవాలలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు